క్లుప్తంగా

రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన



అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న వైద్యులు

నంద్యాలటౌన్: ఐఎంఏ నంద్యాల మహిళా విభాగం ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక నర్మదా హాస్పిటల్‌లో రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మహిళా విభాగం అధ్యక్షురాలు డాక్టర్ కల్పన మాట్లాడుతూ రొము క్యాన్సర్‌పై అవగాహన లేక పోవడం వల్ల వ్యాధిని ప్రారంభ దశలో గుర్తించలేక పోతున్నామన్నారు. రొమ్ము క్యాన్సర్ స్వీయ పరీక్ష గురించి మహిళల్లో అవగహన కలిస్తే వ్యాధిని ప్రారంభ దశలోనే గుర్తించవచ్చన్నారు. అనంతరం మహిళలకు అల్ట్రా సౌండ్ పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో విజయలక్ష్మి, డాక్టర్లు నర్మద, సరిత, ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

హోరాహోరీగా త్రోబాల్ పోటీలు



పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలోని గురురాజ పాఠశాల క్రీడా మైదానంలో జరుగుతున్న జిల్లా స్థాయి త్రోబాల్ పోటీలు హోరాహోరీగా సాగాయి. ఆదివారం పోటీలను గురురాజ బ్యాంకింగ్ కోచింగ్ సెంటర్ అధినేత దస్తగిరి రెడ్డి, డైరెక్టర్ షేక్షావలిరెడ్డి ప్రారంభించారు. రెండో రోజు ఉమ్మడి జిల్లా నుంచి 99 జట్లు పాల్గొన్నాయని వారు తెలిపారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు, స్కూల్‌గేమ్ ఫెడరేషన్ కార్యదర్శి శివకుమార్ పాల్గొన్నారు.

పెద్దమ్మకు ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో మూల పెద్దమ్మ

దొర్నిపాడు: మండలంలోని డబ్ల్యూ.గోవిందిన్నె గ్రామంలో వెలసిన మూలపెద్దమ్మ అమ్మవారికి ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. వేకువజామునుంచే మహిళలు పుణ్యస్నానాలు ఆచరించి అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం అమ్మవారికి అభిషేకాలు, హారతులు పట్టారు. గాజులు, నిమ్మకాయలు, చీరలు, పిండివంటలు చెల్లించి మొక్కులు తీర్చుకున్నారు.

కోటేష్‌కు ఆర్ట్ గెలాక్సీ అవార్డు



అవార్డు అందుకుంటున్న కోటేష్

నంద్యాల(అర్బన్): చిత్రకళ పండుగలో భాగంగా పట్టణానికి చెందిన ప్రముఖ చిత్రకారుడు చింతలపల్లె కోటేష్ చిత్రకళకు చేసిన సేవలను గుర్తించి ఒంగోలులోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ భవన్‌లో ఆదివారం సృష్టి ఆర్ట్ అకాడమీ నిర్వాహకులు శేషబ్రహ్మం, తిమ్మిరి రవీంద్ర ఆర్ట్ గెలాక్సీ అవార్డు అందజేశారు. కోటేష్‌ను నంద్యాల చిత్రకారులు సుంకన్న, ఓబులేసు, నరసింహ, వాసు, కిశోర్ అభినందించారు. ఆయన మాట్లాడుతూ అవార్డు అందుకోవడం సంతోషంగా ఉందన్నారు.

దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి



నిరసన వ్యక్తం చేస్తున్న ఆర్టీసీ యూనియన్ నాయకులు

నంద్యాలటౌన్: కావలిలో ఆర్టీసీ డ్రైవర్ బీఆర్ సింగ్‌పై దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పీటీడీకి చెందిన వివిధ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. శనివారం స్థానిక డిపోలో చేపట్టిన నిరసన కార్యక్రమంలో మజ్దూర్ యూనియన్ కార్యదర్శి సుబ్బరాజు, ఈయూ కార్యదర్శి మూర్తి, వైఎస్సార్ యూనియన్ శ్రీపతి తదితరులు పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ భౌతిక దాడులకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించడమే కాకుండా ఇలాంటివి పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలని కోరారు.

ఎస్టీ రిజర్వేషన్‌ను సాధించుకుందాం

నంద్యాల(అర్బన్): ఆదికవి వాల్మీకి మహర్షి జయంతిని జిల్లాలోని 33 మండలాల్లో విజయవంతంగా నిర్వహించామని, అదే ఉత్సాహంతో వాల్మీకుల ఎస్టీ రిజర్వేషన్‌ను సాధించుకొనే దిశగా సాగాలని ఎంవీఆర్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పులికొండన్న తెలిపారు. స్థానిక కార్యాలయంలో ఆదివారం ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. నాయకులు జయరాం, మదనగోపాల్, నారాయణ, వెంకటేశ్వర్లు, శివనాగేంద్ర, శ్రీనివాసులు, బైరేష్, లాలుస్వామి పాల్గొన్నారు.

అభ్యాసకులకు సదావకాశం

- ఓపెన్ స్కూల్‌లో పది, ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం
- రేపటితో ముగియనున్న గడువు
- ఇప్పటికే ప్రారంభమైన తరగతులు



నంద్యాల ఓపెన్ స్కూల్‌లో తరగతులు నిర్వహిస్తున్న దృశ్యం

నంద్యాల(న్యూటౌన్): అభ్యాసకులకు విద్యను మరింత చేరువచేసేలా ప్రభుత్వం ఓపెన్ స్కూల్ తరగతులు నిర్వహిస్తోంది. వివిధ కారణాల వల్ల చదువు మానేసిన వారు పదో తరగతి, ఇంటర్ పూర్తి చేసేందుకు ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం (ఏపీ ఓపెన్ స్కూల్) ద్వారా ప్రభుత్వం సువర్ణావకాశం కల్పిస్తోంది. ఈ సర్టిఫికెట్లకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల గుర్తింపు ఉంది. ఇందులో సర్టిఫికెట్ పొందిన వారు ఎలాంటి ఉద్యోగానికైనా అర్హులే. నెలాఖరు వరకు వీటికి దరఖాస్తు చేసుకోవచ్చు. ప్రవేశాలు పొందిన వారికి ఇప్పటికే తరగతులు ప్రారంభమయ్యాయి.

పదికి 35, ఇంటర్‌కు 63 కేంద్రాలు..

నంద్యాల జిల్లాలో పదో తరగతికి 35, ఇంటర్‌కు 63 అధ్యయన కేంద్రాలు ఉన్నాయి. పదో తరగతిలో వంద మందికి, ఇంటర్ నాన్ సైన్స్‌లో 40, సైన్స్‌లో వంద మందికి అవకాశం ఉంది. అడ్మిషన్ పొందిన వారికి వెంటనే స్టడీ మెటీరియల్ అందజేస్తారు. ప్రతి ఆదివారంతో పాటు సెలవు దినాల్లో అధ్యయన కేంద్రాల్లో తరగతులు నిర్వహిస్తారు. పదో తరగతితో పాటు ఇంటర్‌లో ఆర్ట్స్ గ్రూపులైన హెచ్ఈసీ, సీఈసీ, సైన్స్ గ్రూపులైన ఎంపీసీ, బైపీపీ, ఎంబైపీసీ, ఎంఈసీలో ప్రవేశాలు పొందవచ్చు. ఈ సర్టిఫికెట్లు ఉన్నత చదువులకు,ఉద్యోగాలకు, పదోన్నతులకు ఉపయోగపడతాయి.

దరఖాస్తు ఇలా..

అభ్యర్థులు 31-08-2023 నాటికి 14ఏళ్ల వయస్సు ఉండాలి. పదో తరగతి మార్కుల జాబితా లేదా జనన ధ్రువీకరణ పత్రం, టీసీ, ఆధార్ కార్డు, కుల ధ్రువీకరణ పత్రం, బ్యాంకు పాస్ బుక్, ఫొటో, సంతకంతో దరఖాస్తు చేసుకోవాలి.

దరఖాస్తు గడువు పెంపు



చదువుకోవాలనుకునే వారికి ఓపెన్ స్కూల్ మంచి అవకాశం. ఇప్పటికే పలువురు దరఖాస్తు చేసుకోగా, మరింత మందికి అవకాశామిచ్చేలా ప్రభుత్వం గడువు పెంచింది. రూ.200 ఫీజుతో ఈ నెలాఖరు వరకు అవకాశం ఉంది. ఈ సర్టిఫికెట్లకు ప్రభుత్వ గుర్తింపు ఉంది. అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

–సుధాకర్‌రెడ్డి, డీఈఓ, నంద్యాల

చదువు మానేసిన వారికి సువర్ణావకాశం



మధ్యలోనే చదువు మానేసిన వారికి ఓపెన్ స్కూల్ సువర్ణావకాశం. ఉద్యోగాలు, ఇతర పనులు చేసుకుంటూ కూడా ఓపెన్ స్కూల్‌లో ప్రవేశం పొందవచ్చు. ఆదివారం, సెలవు రోజుల్లో సబ్జెక్టు టీచర్లతో కాంట్రాక్టు తరగతులు నిర్వహిస్తున్నాం. రేపటితో దరఖాస్తుకు గడువు ముగియనుంది.

– లక్ష్మీనారాయణ, ఓపెన్ స్కూల్ జిల్లా కో ఆర్డినేటర్

వ్యవసాయ విద్యుత్ వేళలు

ఉయ్యాలవాడ : మండలంలోని రైతులకు పగటిపూట 9 గంటల ఉచిత విద్యుత్ సరఫరా అందిస్తున్నట్లు ఏఈ గురప్ప తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ సోమవారం నుంచి వారం రోజుల పాటు సుద్దమల్ల, మాయలూరు ఫీడర్ల పరిధిలోని గ్రామాలకు ఉదయం 9.30 నుంచి సాయంత్రం 6.30 గంటల వరకు ఇంజేడు, కొండుపల్లె, హరివరం, ఎస్.కొత్తపల్లె, అక్కంపల్లె ఫీడర్ల పరిధిలోని గ్రామాలకు ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకు త్రీఫేస్ విద్యుత్ సరఫరా అందిజేస్తామని వివరించారు.

నేడు స్పందన

ఉయ్యాలవాడ : స్థానిక రెవెన్యూ కార్యాలయంలో సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ప్రజల సమస్యలను తెలుసుకునేందుకు స్పందన కార్యక్రమం నిర్వహిస్తామని తహసీల్దార్ రవికుమార్ ఆదివారం తెలిపారు. గ్రామ సచివాలయాల్లో ప్రతి రోజు మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నారని, అక్కడ సమస్యలు పరిష్కారానికి నోచుకోకపోతే మండల కేంద్రంలో జరిగే కార్యక్రమానికి హాజరై అర్జీలు సమర్పించాలని కోరారు.

పొదుపు సభ్యుల జీవనోపాధులపై సమీక్ష



రుద్రవరంలో పొదుపు మహిళల నుంచి వివరాలు సేకరిస్తున్న దృశ్యం

రుద్రవరం: బ్యాంకు లింకేజీ ద్వారా తీసుకున్న రుణాలతో జీవనాలు మెరుగు పరచుకోవాలని ఎన్ఐఆర్డీ టీం సభ్యులు పొదుపు మహిళలకు సూచించారు. స్థానిక వైఎస్సార్ క్రాంతి పథకం కార్యాలయంలో ఆదివారం పొదుపు సంఘాల సభ్యులతో సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా బ్యాంకుల నుంచి రుణాలు పొందడం, తిరిగి చెల్లించడం వంటి వాటిపై ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. అలాగే ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలకు సంబంధించిన మొత్తాలు అందించడంలో బ్యాంకులు ఇబ్బందులు కలిగిస్తున్నారా అని ఆరా తీశారు.అలాగే తీసుకున్న రుణాలతో జీవనోపాధుల నిమిత్తం ఏర్పాటు చేసుకున్న యూనిట్ల గురించి అడిగి తెలుసుకున్నారు. అయితే బ్యాంకులు రుణాలు మంజూరు చేసే సమయంలో పూర్తి మొత్తం ఇవ్వకుండా కొంత డిపాజిట్ పేరుతో నిలిపేస్తున్నారని, ప్రీమియం ఫీజుల కింద అధిక వసూళ్లు చేస్తున్నారని పొదుపు సభ్యులు వివరించారు. కార్యక్రమంలో టీం సభ్యులు డాక్టర్ రమేష్,అనిల్,ఎల్లయ్య,ఏపీఎం కల్పలత, సీసీ, వీవోఏ ఉన్నారు.

వైభవంగా వసంతోత్సవం



బంగారు చీర అలంకారంలో వాసవీ మాత

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని మెయిన్ బజార్‌లో వెలసిన అమ్మవారి శాలలో అమ్మవారి వసంతోత్సవ వేడుకలు ఆదివారం వాసవీ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 108 కన్యలతో చెరువు కట్టకు మేళతాళాలతో వెళ్లి గంగాజలం తీసుకొచ్చి అమ్మవారికి జలాభిషేకం అనంతరం ప్రత్యేక పూజలు చేసి బంగారు చీరతో అలంకరించారు. అంతకు ముందు ఉదయాన్నే పసుపు నీళ్లతో రంగుబడిని ఏర్పాటు చేసి పట్టణంలో ఊరేగింపుగా వసంతోత్సవాన్ని నిర్వహించుకున్నారు. మధ్యాహ్నం పట్టణంలోని ఆర్యవైశ్యులందరికీ ఊరివిందు ఏర్పాటు చేశారు. సంఘం అధ్యక్షుడు భవనాశి వాసు, శేషు, వాసవీ మహిళా మండలి అధ్యక్షురాలు తాండూరి ఇందుమతి, శోభారాణి పాల్గొన్నారు.



ఊరివిందు ఏర్పాటు చేసిన దృశ్యం



పాలసాగరంలో నాటి ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

ఘనంగా హైస్కూల్ గోల్డెన్ జూబ్లీ

ఆళ్లగడ్డ: పట్టణ శివారులోని పాలసాగరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గోల్డెన్ జూబ్లీ మహోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రారంభించి 50 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా 50 సంవత్సరాల్లో అక్కడ విద్యనభ్యసించిన పూర్వ విద్యార్థులందరూ కలిసి కార్యక్రమాన్ని నిర్వహించారు. పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అప్పటి ఉపాధ్యాయులను సన్మానించారు. పూర్వ విద్యార్థులు గత జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ ఉత్సాహంగా గడిపారు.

జయప్రదం చేయండి

నంద్యాల(న్యూటౌన్): నవంబర్ 16న జరిగే పీడీఎస్‌యూ ఉమ్మడి జిల్లా మహాసభను జయప్రదం చేయాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జునైదు బాషా, జిల్లా అధ్యక్షుడు ఎస్ఎండీ రఫీ, జిల్లా ప్రధాన కార్యదర్శి నాగరాజు తెలిపారు. ఆదివారం స్థానిక కార్యాలయంలో వారు మాట్లాడుతూ శాస్త్రీయ విద్యావిధాన సాధనకు, విద్యారంగ సమస్యల పరిష్కారానికి పీడీఎస్‌యూ నిరంతరం పోరాటం చేస్తుందన్నారు. కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం దేశంలోని విద్యను కాషాయికరణ, ప్రైవేటీకరణ దిశగా తీసుకెళ్తుందని ఆరోపించారు. నిరుద్యోగులకు 2కోట్ల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి మోదీ ప్రభుత్వం మోసం చేసిందని విమర్శించారు. 107, 108 జీఓలు మెడికల్ విద్యార్థులకు శాపంగా మారాయన్నారు. నాయకులు బాలాజీ, నవీన్, రవితేజ, రమణ, విజయ్, బాలు, రవీంద్ర, కిరణ్, దయానంద్ పాల్గొన్నారు.

గ్రంథాలయాలు ఆధునిక దేవాలయాలు



పాతపేట గ్రంథాలయానికి పుస్తకాలు అందజేస్తున్న దృశ్యం

నంద్యాల(వ్యవసాయం): గ్రంథాలయాలు ఆధునిక దేవాలయాలు అని, వాటి అభివృద్ధికి ప్రతి ఒక్కరూ చేయూతనందించాలని జేసీఎస్ జిల్లా కన్వీనర్, ట్రిపుల్ ఆర్ సెంటర్ నిర్వాహకులు సాయిరాంరెడ్డి కోరారు. పట్టణంలోని పురాతన గ్రంథాలయానికి 127 పుస్తకాలను ఆదివారం గ్రంథాలయ నిర్వాహకుడు శివకు అందజేశారు. సాయిరాంరెడ్డి మాట్లాడుతూ పాత పేట గ్రంథాలయం ద్వారా ఎంతో మంది విజ్ఞానాన్ని పొందడమే కాకుండా ఉద్యోగాలు సాధించారన్నారు. గ్రంథాలయ సిబ్బంది కోటి, యువరాజు తదితరులు పాల్గొన్నారు.

నంద్యాల(వ్యవసాయం): పఠనంతోనే ప్రజ్ఞా సృజన, వివేకం కలుగుతాయని భాషోపాధ్యాయ సంస్థ రాష్ట్ర కార్యదర్శి అన్నయ్య పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని పింగళి సూరన శాఖ గ్రంథాలయానికి భాషోపాధ్యాయ సంస్థ తరఫున తెలుగు సాహిత్య పుస్తకాలను గ్రంథాలయ ఇన్‌చార్జ్ శ్రీధర్‌కు అందజేశారు. ఈ సందర్భంగా తెలుగు పండితుడు అన్నెం శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ విజ్ఞాన నిలయాలైన పుస్తకాలు సమాజ ప్రగతికి రథచక్రాలై విజ్ఞాన వికాసపు వెలుగులను తరతరాలకు అందిస్తాయన్నారు.

వెంకటాపురంలో భారీ అగ్నిప్రమాదం

ఆత్మకూరు: మండలంలోని వెంకటాపురం గ్రామంలో ఆదివారం వేకువజామున భారీ అగ్నిప్రమాదం జరిగింది. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ తో ఈ ప్రమాదం జరిగినట్లు బాధిత కుటుంబసభ్యులు తెలిపారు. ఈ ఘటనలో విజయ్‌భాస్కర్ రెడ్డికి చెందిన మూడు పాడి గేదెలు, దూడలు, ఇళ్లు, రెండు గడ్డివాములు, ఒక షెడ్, వ్యవసాయ పనిముట్లు, వంటసామగ్రి, కుటుంబానికి చెందిన నిత్యావసర సరుకులు కాలి బూడిదయ్యాయి. దాదాపు రూ.8 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు ఆస్తి నష్టం జరిగినట్లు బాధితులు తెలిపారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వలన కరెంట్ తీగలకు మంటలు వ్యాపించి గడ్డివాముతో పాటు షెడ్, అందులో ఉన్న పాడిపశువులు, వంటసామగ్రితో సహా కాలిపోయాయి. కుటుంబసభ్యులు ఇంటి బయట నిద్రించడంతో వారికి ఎలాంటి ప్రమాదం జరుగకుండా బయటపడ్డారు. కేవలం దంపతులు మాత్రమే ఉండడం వలన పశువులను షెడ్లనుంచి బయటికి తీసుకురాలేకపోయారు. మంటలు భారీగా వ్యాపించడంతో గ్రామంలో ఉన్న ప్రజలు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. అప్పటికే మంటలు తారాస్థాయికి చేరుకున్నాయి. గ్రామస్తులు అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించడంతో సంఘటనా స్థలానికి హుటాహుటిన ఫైర్ సిబ్బంది చేరుకుని మంటలను అదుపు చేశారు. అలాగే విద్యుత్ అధికారులు సమాచారం ఇవ్వడంతో కరెంట్ నిలిపివేశారు. కుటుంబసభ్యులు సర్వం కాలిపోవడంతో దిక్కుతోచని స్థితిలో ఉండిపోయారు.

అభివృద్ధి కనిపించడం లేదా?

- రూ.34 కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనులు ప్రారంభం



శిలాఫలకం ఆవిష్కరించి పాఠశాల తరగతి గదులు, ప్రహరీని ప్రారంభిస్తున్న గంగుల ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి

చాగలమర్రి: ప్రతిపక్ష పార్టీల నాయకులకు తాలూకాలో చేసిన అభివృద్ధి పనులు కనిపించడం లేదా? అని ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి, జలవనరుల శాఖ ప్రభుత్వ సలహాదారు గంగుల ప్రభాకర్‌రెడ్డి ప్రశ్నించారు. మండలంలో సుమారు రూ.34.70 లక్షలతో పూర్తియిన సీసీ రోడ్లు, డ్రైనేజీ కాలువలు, పాఠశాల భవనాలు, ప్రహరీ, వాటర్ ప్లాంట్లను ఆదివారం ప్రారంభించారు. వారు మాట్లాడుతూ మాజీ మంత్రి విలువలు తెలియకుండా ప్రవర్తిస్తున్నారని మండిపడ్డారు. వర్షాభావ పరిస్థితుల వలన కేసీ కాల్వకు నీరు వదలడం ఆలస్యమైందని, అయినా చివరి ఆయుకట్టు వరకు సాగునీరు అందించే బాధ్యత తమపై ఉందన్నారు. అభివృద్ధికి మారు పేరు గంగుల కుటుంబం అన్నారు. మండలంలో గత వారంలో సుమారు రూ.2 కోట్ల అభివృద్ధి పనులను ప్రారంభించామన్నారు. అలాగే..ఎన్నో ఏళ్ల నుంచి ఎదురు చూస్తున్న చాగలమర్రి నుంచి మహాదేవపురం వరకు రూ.30 కోట్లతో నిర్మించిన బిటి రోడ్డు, రూ.2 కోట్లతో నిర్మించిన 8 పాఠశాల అదనపు తరగతి గదులు, ప్రహరీ, కూలూరు రస్తాలో రూ.25 లక్షలతో నిర్మించిన డ్రైనేజీ, రూ. 6 లక్షలతో ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్, ఎంపీపీ వీరభద్రుడు ఇంటి వద్ద నిర్మించిన సీసీ రోడ్డు, రామ్మూర్తి ఇంటి నుంచి ముత్యాలపాడు బస్టాండు వరకు రూ.67.80 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డు, అలాగే చిన్న బోదనం, తిప్పనపల్లె గ్రామాల్లో రూ.15.00 లక్షలతో నిర్మించిన రోడ్లను, మల్లెవేములలో రూ.10 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లను ప్రారంభించారు. కార్యక్రమంలో జేసీఎస్ జిల్లా కోఆర్డినేటర్ షేక్ బాబులాల్, ఎంపీపీ వీరభద్రుడు, జెడ్పీటీసీ సభ్యురాలు జి.లక్ష్మీదేవి, మండల ఉపాధ్యక్షుడు ముల్లా రఫీ, సర్పంచ్ తులసమ్మ, ఉప సర్పంచ్ షేక్ మహమ్మద్ సోహెల్, ఎంపీటీసీలు పత్తినారాయణ, లక్ష్మీరెడ్డి, ఫయాజ్, నరసింహుడు, నాయకులు స్వామిరెడ్డి, రమణారెడ్డి, చిన్నినాయుడు, నరసింహ్మరెడ్డి, నారపురెడ్డి, వెంకట్రామిరెడ్డి, బాలకృష్ణారెడ్డి, ఓబుల్‌రెడ్డి, రామగురివిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమస్యలకు శాశ్వత పరిష్కారమే ధ్యేయం

చాగలమర్రి: తమ కుటుంబం రాజాకీయల్లోకి వచ్చినప్పటి నుంచి ప్రజా సమస్యలకు శాశ్వత పరిష్కార మార్గం చూపడమే ధ్యేయంగా పనిచేస్తున్నామని జలవనులరుల శాఖ ప్రభుత్వ సలహాదారు గంగుల ప్రభాకర్‌రెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక ఎస్ఆర్ ఫంక్షన్ హాల్‌లో జేసీఎస్ జిల్లా కో–ఆర్డినేటర్ షేక్ బాబులాల్ ఆధ్వర్యంలో ఆయనను సన్మానించారు. గంగుల మాట్లాడతూ నియోజకవర్గంలో కొందరు చిల్లర మాటలు మాట్లాడుతూ అభివృద్ధి గురించి విమర్శిస్తున్నారని, వారికి ఇదే చివరి సమాధానమన్నారు. కిడ్నాప్‌లు చేయడం, ప్రజల వద్ద దౌర్జన్యం చేసి డబ్బులు లాక్కోవడం మా పెద్దలు తమకు నేర్పలేదని, ప్రజలకు బజవాబుదారీ పనిచేయడమొక్కటే తెలుసనని చెప్పారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు సామాజిక బస్సుయాత్ర వచ్చే నెల 7వ తేదీ నుంచి చాగలమర్రి నుంచి ప్రారంభిస్తున్నట్లు తెలిపారు.



గంగుల ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి సన్మానిస్తున్న చాగలమర్రి నాయకులు

9న ఉర్దూ రథన్ అవార్డుల ప్రదానం

నంద్యాల(వ్యవసాయం): నవంబర్ 9వ తేదీన ప్రముఖ ఉర్దూ కవి అల్లామా ఇక్బాల్ జయంతి సందర్భంగా స్థానిక వివేకానంద ఆడిటోరియంలో ప్రతిష్టాత్మకమైన ఉర్దూ రథన్ అవార్డులు ప్రదానం చేస్తామని నంద్యాల కార్వాన్–ఏ ఉర్దూ అధ్యక్షుడు అబ్దుల్‌సమ్మద్ తెలిపారు. ఆదివారం స్థానిక కార్యాలయంలో కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ ఉర్దూ రథన్ అవార్డుల కోసం దరఖాస్తు ఫారాలను అందజేస్తున్నట్లు వారు తెలిపారు. ఉమ్మడి రాష్ట్రాల్లో వివిధ రంగాల్లో ఉర్దూ భాషకు సేవ చేసిన ప్రముఖులకు అవార్డుతో సన్మానిస్తామని చెప్పారు. రాష్ట్రస్థాయిలో ఉర్దూ సాహిత్య సేవలు చేసిన ఉర్దూ టీచర్లకు, సర్వశిక్ష అభియాన్ వలంటీర్లకు, రాష్ట్ర స్థాయి ఉర్దూ జర్నలిస్టులకు అవార్డులు ఉంటాయన్నారు. ఈ దరఖాస్తు ఫారాలు నవంబర్ 4వ తేదీ వరకు ఉర్దూ లైబ్రరీలో లభిస్తాయని పేర్కొన్నారు. వివరాలకు సెల్: 9059590071 నంబర్‌లో సంప్రదించాలని కోరారు. హాజీ అబ్దుల్‌సుకూర్, మున్సిపల్ కో ఆప్షన్ సభ్యుడు సలాముల్లా, అబ్దుల్‌అజీజ్, డాక్టర్ అంజాద్, అంజాద్‌షరీఫ్ పాల్గొన్నారు.

అన్నప్రసాద వితరణ పథకానికి విరాళం

శ్రీశైలం: శ్రీశైలదేవస్థానం భక్తుల సౌకర్యార్థం నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి రాజమహేంద్రవరానికి చెందిన ఆర్ వెంకటనాగమల్లేష్ రూ.1,00,001 విరాళంగా అందజేశారు. ఈ విరాళాన్ని ఆదివారం విరాళాల కేంద్రంలోని ఏఈఓ ఫణిధర ప్రసాద్‌కు అందజేయగా, వారు దాతలకు స్వామివార్ల శేషవస్త్రాలు, లడ్డూప్రసాదాలు, జ్ఞాపికను అందజేశారు.

మల్లన్న సేవలో ప్రముఖులు



అమ్మవారి ఆశీర్వచన మండపంలో ఇన్‌కంటాక్స్ ప్రిన్సిపల్ చీఫ్ కమిషనర్

శ్రీశైలం: శ్రీశైల శ్రీభ్రమరాంబామల్లికార్జునస్వామివార్లను భువనేశ్వర్ ఇన్‌కంటాక్స్ డిపార్ట్‌మెంట్ ప్రిన్సిపల్ చీఫ్ కమిషనర్ భూపాల్‌రెడ్డి, గుజరాత్ కంస్యూమర్స్ డిస్ప్యూట్స్ రెడ్రెస్సెల్ కమిషన్ ప్రెసిడెంట్ ఎంజే మెహతా, ముంబాయ్‌కు చెందిన ఎస్‌బీఐ చీఫ్ జనరల్ మేనేజర్ ప్రకాష్ సింగ్ శ్రీ ఆదివారం వేర్వేరుగా దర్శించుకున్నారు. వీరికి ప్రధానాలయ రాజగోపురం వద్ద ఈఓ డి.పెద్దిరాజు, అర్చకులు ఆలయ మర్యాదలతో ఆహ్వానం పలికారు. అనంతరం వీరు స్వామివారికి రుద్రాభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన తదితర ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారి ఆశీర్వచన మండపంలో అర్చకవేద పండితులు ఆశీర్వచనాలు పలుకగా, ఈఓ స్వామివార్ల శేషవస్త్రాలు, లడ్డూప్రసాదాలు అందజేశారు.

అంగన్‌వాడీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న లలితమ్మ

నంద్యాల(న్యూటౌన్): అంగన్‌వాడీ కార్మికులకు వేతనాలు పెంచి ఫేస్ యాప్ రద్దు చేయాలని ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లలితమ్మ కోరారు. ఆదివారం పట్టణంలోని కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఎఫ్ఆర్ఎస్ యాప్ అంగన్‌వాడీలకు ఇబ్బందిగా మారిందని, సిగ్నల్స్ సరిగా ఉండటం లేదని, కనీస వేతనాలు రూ.26వేలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. అంగన్‌వాడీలకు మెడికల్ లీవ్‌లు ఇవ్వాలని, నాణ్యమైన సరుకులు, మే నెల అంతా వేసవి సెలవులు మంజూరు చేయాలన్నారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు మునెప్ప, జిల్లా ప్రధాన కార్యదర్శి సుగుణమ్మ, అబ్బాస్, భాస్కర్, చంద్రకళ, తిరుపాలమ్మ, పద్మ, సుజాత, సులోచనమ్మ పాల్గొన్నారు.

జలజీవన్ నిధులు మంజూరు

రుద్రవరం: మండలంలోని ఆలమూరు,మందలూరు గ్రామాలకు జలజీవన్ మిషన్ పథకం కింద నిధులు మంజూరయ్యాయని ఆయా గ్రామాల సర్పంచులు పాణ్యం లక్ష్మీదేవి, నిర్మలాదేవి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ప్రమోద్ ఆదివారం తెలిపారు. ఆయా గ్రామాల్లో ఓహెచ్ఆర్ఎస్ ట్యాంకులు దెబ్బతినడంతో బోరు మోటార్ల నుంచి నేరుగా తాగునీటి సరఫరా చేస్తున్నారు. సమస్యను గమనించిన జలవనరుల మండలి సలహాదారు గంగుల ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్యే బిజేంద్రారెడ్డి ప్రభుత్వం దృష్టికి తీసుకుకెళ్లారు.దీంతో ఆలమూరుకు రూ.71.40 లక్షలు, మందలూరుకు రూ.69.90లక్షల నిధులు మంజూరు చేసింది. టెండర్ ప్రక్రియ పూర్తి కాగానే పనులు ప్రారంభించి నూతన ఓహెచ్ఆర్‌లు,పైప్‌లైన్లు,ఇంటింటికి కుళాయిలు వేయిస్తామని వారు తెలిపారు.

మంచి చేసినందునే ప్రజల్లోకి వెళ్తున్నాం



మూడురాళ్ళపల్లెలో మహిళకు బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి

చాగలమర్రి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పారదర్శక పాలన, అభివృద్ధి, సంక్షేమ పథకాల ద్వారా మంచి చేశారని, అన్ని వర్గాల ప్రజలు లబ్ధి పొందడంతోనే తాము నేడు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా ఇంటింటికి వెళ్తున్నామని ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని శెట్టివీడు గ్రామ పంచాయతీ మజరాలైన మూడురాళ్ళపల్లె, కదిరిపురం, తండా గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ఇంటింటికీ తిరిగి బుక్‌లెట్ అందజేసి పథకాల ద్వారా పొందిన లబ్ధిని వివరించారు. అలాగే పాలన తీరు, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు జి.కుమార్‌రెడ్డి, జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు జి.గణేష్‌రెడ్డి, నాయకులు లక్ష్మీరెడ్డి, సుదర్శన్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రయాణం సాఫీగా..



ఉయ్యాలవాడ-కొండుపల్లె రహదారిలో గుంతలు పూడ్చడంతో సాఫీగా వెళ్తున్న వాహనాలు

ఉయ్యాలవాడ : మండల కేంద్రం నుంచి కొండుపల్లెకు వెళ్లే రహదారి గుంతలు పడి అధ్వానంగా మారడంతో వాహనదారులు రాకపోకలకు దశాబ్దాలుగా ఇబ్బందులు పడ్డారు. తమ అవస్థలను ప్రజలు ప్రజా ప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా గత ప్రభుత్వంలో పట్టించుకోలేదు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక ఎంపీ పోచా బ్రహ్మానంద రెడ్డి, ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి దృష్టికి గ్రామ నాయకులు తీసుకెళ్లారు. దీంతో ప్రభుత్వం తారు రోడ్డు నిర్మాణం కోసం రూ. 9.50 కోట్లు మంజూరు చేసింది. పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ యుద్ధ ప్రాతిపదికన పనులు ప్రారంభించారు. రోడుకు ఇరువైపులద్దున్న ముళ్ల పొదలను తొలగించి మట్టి తరలించి గుంతలను పూడ్చడంతో వాహనదారులు సాఫీగా ప్రయాణం సాగిస్తున్నారు. తారురోడ్డు నిర్మాణం పూర్తయితే రహదారి కష్టాలు తొలుగుతాయని ఆయా గ్రామాల ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.